క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నల్లగొండ : పట్టణంలో జరుగుతున్న రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా నేడు (శుక్రవారం) పెద్దబండ, ఇండోర్ స్టేడియం, గొల్లగూడ ప్రాంతాల్లో ఉదయం 7గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు డీఈ శంకరయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అందుకు వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ప్రభుత్వ కాలేజీలు ఏర్పాటు చేయాలి

చిట్యాల : మండల కేంద్రంలో ప్రభుత్వ ఇంటర్, డిగ్రీ కాలేజీలను ఏర్పాటు చేయాలని వైఎస్సార్‌టీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎండీ.ముజాహిద్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. వందలాది మంది పేద విద్యార్థులు పదోతరగతి పూర్తి చేసిన అనంతరం ప్రైవేట్ కాలేజీల్లో చేరలేక ఇబ్బందులు పడుతున్నారని, సంబంధిత విద్యాశాఖ అధికారులు తగిన చర్యలు తీసుకొని ప్రభుత్వ కాలేజీలను ఏర్పాటు చేయాలని కోరారు.

కుమార్‌గౌడ్‌కు డాక్టరేట్


డాక్టరేట్ పట్టా అందుకుంటున్న కుమార్‌గౌడ్

నకిరేకల్ : మండలంలోని కడపర్తి గ్రామానికి చెందిన యర్కల కుమార్‌గౌడ్ ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి వృక్షశాస్త్రంలో డాక్టరేట్ అందుకున్నారు. ప్రస్తుతం కుమార్‌గౌడ్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో ఒప్పంద అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. డాక్టరేట్‌ను విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ సీతారామారావు, రిజిస్ట్రార్ ఏవీఎన్, అకాడమిక్ డైరెక్టర్ ప్రొఫెసర్ గంటా చక్రపాణి చేతుల మీదుగా అందుకున్నారు.

ఎంపీ కోమటిరెడ్డి ప్రకటనపై హర్షం

కేతేపల్లి : వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో నల్లగొండ అసెంబ్లీ సీటును అవసరమైతే బీసీలకు త్యాగం చేస్తానని ఎంపీ కోమటిరెడ్డి ప్రకటన చేయడం పట్ల డీసీసీ మాజీ ఉపాధ్యక్షుడు జటంగి వెంకటనర్సయ్య యాదవ్ హర్షం వ్యక్తం చేశారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని ప్రతి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో రెండు అసెంబ్లీ స్థానాలను ఖచ్చితంగా బీసీ అభ్యర్థులకు కేటాయించాలని ఆయన కాంగ్రెస్ పార్టీ అధిష్టానాన్ని కోరారు.

కోమటిరెడ్డి మాట నిలబెట్టుకోవాలి

కనగల్ : నల్లగొండ నియోజకవర్గ సీటును బీసీలకు త్యాగం చేస్తానని కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని కనగల్ ఎంపీటీసీ, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు పాలకూరి సైదులు అన్నారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వెంకట్‌రెడ్డి ఇచ్చిన మాట నిలబెట్టుకోలేని పక్షంలో నల్లగొండలోని క్లాక్ టవర్ సెంటర్లో బీసీలకు బహిరంగ క్షమాపణ చెప్పాలన్నారు. ఇచ్చిన మాట నిలబెట్టుకుంటే తాను ఎంపీటీసీ పదవికి రాజీనామా చేసి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి గొడుగు పట్టి ఆయన వెంటే తిరుగుతానని అన్నారు. సమావేశంలో ఆయన వెంట బీఆర్ఎస్ కార్యకర్తలు ఉన్నారు.

ఇష్టారాజ్యంగా తాటిచెట్ల నరికివేత


మునుగోడు శివారులో రోడ్డు పక్కన నరికివేసిన తాటిచెట్లు

మునుగోడు : మండల వ్యాప్తంగా వివిధ గ్రామాల్లో రైతులు వ్యవసాయ భూమిలో, రోడ్ల వెంట ఉన్న తాటిచెట్లను ఇష్టారాజ్యంగా నరికివేస్తున్నారు. అంతరిస్తున్న తాటిచెట్ల సంఖ్య పెంచడానికి ప్రభుత్వం హరితహారంలో తాటి మొక్కలు నాటుతున్నారు. ఈ క్రమంలో పలువురు నరికివేస్తుండటంతో తాటి వనాల సంఖ్య భారీగా తగ్గిపోతుంది. ఈ విషయం సంబంధిత అధికారులకు తెలిసినా తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తుండడంతో తాటి చెట్లపై ఆధారపడుతున్న గీత కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా నాగిరెడ్డి


నాగిరెడ్డికి నియామకపత్రం అందజేస్తున్న సీతారాంరెడ్డి

మిర్యాలగూడ టౌన్: బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా మిర్యాలగూడ మండలం శ్రీనివాస్‌నగర్‌కు చెందిన సజ్జల నాగిరెడ్డి నియామకమయ్యారు. ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కంకణాల శ్రీధర్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆయనకు కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు సీతారాంరెడ్డి, మండల అధ్యక్షుడు పులి విద్యాసాగర్ మిర్యాలగూడ పట్టణ పార్టీ కార్యాలయంలో నియామకపత్రం అందజేశారు.

ఘనంగా రక్షాబంధన్ వేడుకలు

అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచే రక్షాబంధన్ సందర్భంగా గురువారం పల్లెలు, పట్టణాల్లో పండుగ వాతావరణం నెలకొంది. సోదరీమణులు తమ సోదరులకు రాఖీలు కట్టి వారి ఆశీర్వాదం తీసుకున్నారు. రాఖీల కొనుగోలుదారులతో రహదారులు కిక్కిరిసి పోయాయి. ఆయా ఆర్టీసీ బస్టాండ్‌లు సైతం ఉదయం 5గంటల నుంచే ప్రయాణికులతో కిటకిటలాడాయి.

– సాక్షి, నెట్‌వర్క్


నల్లగొండ టూటౌన్ : గుత్తా సుఖేందర్‌రెడ్డికి రాఖీ కడుతున్న బీఆర్ఎస్ మహిళా నాయకులు


కేతేపల్లి : రాజ్యసభ సభ్యుడు లింగయ్యయాదవ్‌కు రాఖీ కడుతున్న ఆయన సోదరి


నల్లగొండ టౌన్ : టీఎన్‌జీఓ నాయకులకు రాఖీలు కడుతున్న సహ ఉద్యోగులు


నకిరేకల్ : ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యకు రాఖీ కట్టి హారతి ఇస్తున్న జెడ్పీటీసీ, కౌన్సిలర్లు, తదితరులు


శాలిగౌరారం : ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్‌కు రాఖీ కడుతున్న పెర్కకొండారం ఎంపీటీసీ పుష్ప


నల్లగొండ టూటౌన్ : మున్సిపల్ చైర్మన్ సైదిరెడ్డికి రాఖీ కడుతున్న ఆయన సోదరి సరిత


చండూరు : మాజీ ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డికి రాఖీ కడుతున్న నవవధువు


నల్లగొండ : టూటౌన్ ఎస్ఐకి రాఖీలు కడుతున్న అన్నపూర్ణ సేవా సమితి సభ్యులు


నల్లగొండ : చాడా కిషన్‌రెడ్డికి రాఖీ కడుతున్న సోదరీమణులు


నార్కట్‌పల్లి : తన సోదరితో రాఖీ కట్టించుకుంటున్న ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య


నల్లగొండ : ట్రాఫిక్ సీఐకి రాఖీ కడుతున్న చిన్నారులు


చిట్యాలలో మాజీ సర్పంచ్ జిట్ట నగేష్‌కు రాఖీలు కడుతున్న సోదరీమణులు

భక్తిశ్రద్ధలతో గాయత్రీ హోమం


చిట్యాల : పూజలో పాల్గొన్న పద్మశాలీలు


కట్టంగూర్ : హోమంలో పాల్గొన్న పద్మశాలీలు

చిట్యాల : పట్టణంలో శ్రీభక్త మార్కెండేయ పద్మశాలి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గురువారం గాయత్రీ హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక శ్రీ వేణుగోపాల స్వామి ధాన్య మందిరంలో గురూజీ పున్న పాండుజీ ఆధ్వర్యంలో గాయత్రీ అగ్నిహోమం పూజలు చేశారు. అనంతరం పద్మశాలీయులంతా గాయత్రీధారణ(జంధ్యం) చేసుకున్నారు. ఈ సందర్భంగా గండూరి జగన్ స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలి కాలనీలో..

కట్టంగూర్ : మండల కేంద్రంలోని పద్మశాలి కాలనీలో గురువారం జంధ్యాల పూర్ణిమ సందర్భంగా పద్మశాలీలు గాయత్రీ హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మశాలీలందరూ ప్రత్యేక పూజలు చేసి నూతన జంధ్యాలు ధరించారు. కార్యక్రమంలో గోశిక అంజన్‌కుమార్, రాపోలు మల్లయ్య, ముశం ఉమేష్, గంజి వెంకటేశం, నల్ల పాండరి, గంజి గంగయ్య, గోశిక ఉమాపతి, శంకరయ్య, శాంతికుమార్, శ్రీను, ప్రసాద్, వీరయ్య ఉన్నారు.

రైతులు రుణాలను రెన్యువల్ చేసుకోవాలి

కనగల్ : మండలంలో రూ.లక్ష లోపు రుణమాఫీ పొందిన రైతులంతా వెంటనే బ్యాంక్ ఖాతాలను పరిశీలించి, లోన్ రుణాలు రెన్యువల్ చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి బెజవాడ అమరేందర్‌గౌడ్ సూచించారు. గురువారం మండల పరిధిలోని పంజాబ్ నేషనల్ బ్యాంక్ చెట్ల చెన్నారం, ఏపీజీవీబీ బ్యాంక్ మునుగోడు ఎక్స్‌రోడ్ బ్రాంచ్‌లలో రైతుల రుణమాఫీ వివరాలను బ్యాంక్ మేనేజర్లతో కలిసి ఆయన పరిశీలించారు. ఆయన వెంట ఏపీజీవీబీ మేనేజర్ సురేష్‌నాయక్, ఏఈఓ అభిలాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


బ్యాంక్ అధికారులతో మాట్లాడుతున్న మండల ఏఓ అమరేందర్‌గౌడ్

'అభివృద్ధికి నిరంతరం కృషి'


డ్రైయినేజీ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ పాశం సురేందర్‌రెడ్డి

మర్రిగూడ : మండల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని జెడ్పీటీసీ పాశం సురేందర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని కుదాభక్షపల్లి గ్రామంలో జెడ్పీ నిధులు రూ.2లక్షలతో చేపట్టనున్న డ్రెయినేజీ నిర్మాణ పనులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. భవిష్యత్‌లో సీఎం కేసీఆర్ సహకారంతో మండలానికి మరిన్ని నిధులు తీసుకొచ్చి మరింతగా అభివృద్ధి చేస్తానని ఆయన అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆంబోతు సుధాకర్‌నాయక్, ఉపసర్పంచ్ మైలారపు పార్వతమ్మ, పార్టీ మండల ఉపాధ్యక్షుడు పందుల పాండుగౌడ్, కారింగు నరసింహ, శేఖర్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

'నోముల భగత్‌కే బీసీ కులాల మద్దతు'

త్రిపురారం: నాగార్జునసాగర్ ఎమ్మెల్యే నోముల భగత్ యాదవ్‌కే బీసీ కులాల మద్దతు ఉంటుందని, ఐక్యంగా ఉండి గెలిపించుకుంటామని త్రిపురారం మండల బీసీ కుల సంఘాల నాయకులు తెలిపారు. గురువారం త్రిపురారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో బీసీ కుల సంఘాల మండల నాయకులు, బీఆర్ఎస్ పార్టీ బీసీ అనుబంధ సంఘాల సభ్యులు బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి నోముల భగత్‌కు మద్దతుగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భగత్‌కు టికెట్ కేటాయించిన సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. గత పాలకుల 35 సంవత్సరాల హయాంలో అభివృద్ధి జరగలేదని, బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో గ్రామాభివృద్ధి సాధ్యమైందన్నారు. బీసీలమంతా కలిసికట్టుగా మరోసారి ఎమ్మెల్యేగా నోముల భగత్‌ను గెలిపించుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బహునూతుల నరేందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీటీసీ అంబటి రాము, పావన గుండల వెంకటాచారి, సాగర్ నియోజకవర్గ యాదవ యువజన సంఘం అధ్యక్షుడు జానపాటి సతీష్ యాదవ్, వెంకటేశ్వర్లు, మహిళ అధ్యక్షురాలు మాధా ధనలక్ష్మీ, నాగరాజు, రామచంద్రయ్య, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని వినతి

పెద్దవూర: మండలంలోని తుంగతుర్తి గ్రామ రెవెన్యూ శివారులో ఉన్న దూదివానికుంట చెరువును ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని తండాకు చెందిన రమావత్ శంకర్ కోరారు. ఈమేరకు గురువారం నీటి పారుదల, ఆయకట్టు అభివృద్ధి శాఖ ఉప కార్యనిర్వాహక ఇంజనీర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మిషన్ కాకతీయలో భాగంగా దూదివాని కుంట చెరువుకు 600 మీటర్ల పొడవు కట్ట పోశారని పేర్కొన్నారు. తండాకు చెందిన పలువురు చెరువు కట్టలో సగభాగం చదును చేసి, తమ వ్యవసాయ పొలాల్లోకి మార్చుకుని, అందులో బోర్లు వేశారని ఆరోపించారు. దీనిపై విచారణ చేసి ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో తండావాసులు పాల్గొన్నారు.

ఆదర్శ పట్టణంగా నీలగిరి మున్సిపాలిటీ

- మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి పక్కన కమిషనర్ రమణాచారి

నల్లగొండ టూటౌన్ : రాష్ట్రంలోనే నీలగిరి మున్సిపాలిటీ ఆదర్శ పట్టణంగా రూపుదిద్దుకుంటుందని మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మున్సిపాలిటీ పాలకవర్గ సమావేశం చైర్మన్ మందడి సైదిరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణంలో చేపడుతున్న రహదారుల విస్తరణ, సుందరీకరణ పనులు, ఐటీ హబ్, మెడికల్ నిర్మాణాలతో పట్టణ రూపురేఖలు పూర్తిగా మారిపోయి హైదరాబాద్ నగరాన్ని తలపిస్తుందన్నారు. పట్టణంలో చేపడుతున్న అన్ని రకాల అభివృద్ధి పనులు చివరి దశకు చేరుకున్నాయని, సెప్టెంబర్ రెండో వారంలో సీఎం కేసీఆర్‌తో ఐటీ హబ్, ఇతర అభివృద్ధి పనులను ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఐటీ హబ్‌లో ఉద్యోగాల కోసం 8500 మంది దరఖాస్తులు చేసుకున్నట్లు ఆయన వెల్లడించారు. అనంతరం కోఆప్షన్ సభ్యుడు కొండూరు సత్యనారాయణ మాట్లాడుతూ.. బీఎస్ఎన్ఎల్ కార్యాలయం ఎదురుగా ఉన్న శ్మశానవాటికలో కనీస మౌలిక సదుపాయాలు లేకపోవడంతో దహన సంస్కారాలు చేసే సమయంలో మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు. బీజేపీ ఫ్లోర్ లీడర్ బండారు ప్రసాద్ మాట్లాడుతూ.. వార్డుల అభివృద్ధికి నిధులు ఇస్తామని చెప్పి ఏళ్లు గడుస్తున్నా ప్రభుత్వం నుంచి ఇప్పటికీ నిధులు రాలేదన్నారు. 36వ వార్డులో నీటి పైప్‌లైన్ వేయడంలో ఎందుకు జాప్యం జరుగుతుందని ప్రశ్నించారు. గృహలక్ష్మి, దళితబంధు, బీసీ బంధును పార్టీలకతీతంగా పేదలకు ఇవ్వాలని, బీఆర్ఎస్ కార్యకర్తలకు మాత్రమే ఇవ్వడం సరికాదన్నారు. కౌన్సిలర్ బొడ్డుపల్లి లక్ష్మి మాట్లాడుతూ.. వార్డుల అభివృద్ధికి కేటాయించిన నిధులకు వెంటనే టెండర్లు పిలవాలని డిమాండ్ చేశారు. కౌన్సిలర్ ఖయ్యూం బేగ్ మాట్లాడుతూ.. దళితబంధు, బీసీబంధు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకున్న వారికే వస్తున్నాయని, బీఆర్ఎస్‌పై అపనిందలు సరైందికాదన్నారు. సభ్యులు లేవనెత్తిన ప్రశ్నలకు కమిషనర్ రమణాచారి సమాధానాలు చెప్పారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ రమణాచారి, అసిస్టెంట్ కమిషనర్ సయ్యద్‌ముసాబ్ అహ్మద్, ఈఈ రాములు, ఏసీపీ నాగిరెడ్డి, ఇతర అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

నకిరేకల్‌లో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తాం


ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న రవీందర్

కేతేపల్లి : రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో నకిరేకల్ నియోజకవర్గంలో ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని టీపీసీసీ నేత దైద రవీందర్ ధీమా వ్యక్తం చేశారు. గురువారం మండలంలోని చీకటిగూడెం గ్రామంలో నిర్వహించిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రం ఆవిర్భవించిన నాటి నుంచి రెండు పర్యాయాలు సీఎం కేసీఆర్ మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చారని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను విస్మరించి పబ్బం గడుతున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను కాంగ్రెస్ నాయకులు గ్రామాల్లో గడపగడపకు తిరిగి ప్రజలకు వివరించాలన్నారు. సమావేశంలో ముస్లిం మైనార్టీ సెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎండీ.యూసుఫ్‌జానీ, డీసీసీ కార్యదర్శి కోట పుల్లయ్య, నాయకులు కోట వెంకన్న, ఎస్.మంగమ్మ, గోపయ్య, గణేష్, ప్రభాకర్, వడ్డె నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

గాదరి కిశోర్ హ్యాట్రిక్ సాధించడం ఖాయం


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

శాలిగౌరారం : రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో తుంగతుర్తి నియోజకవర్గంలో ప్రస్తుత ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ మూడో సారి గెలుపొంది హ్యాట్రిక్ సాధించడం ఖాయమని మాదిగ జేఏసీ రాష్ట్ర కార్యదర్శి ఇంద్రకంటి శ్రీనివాస్ అన్నారు. గురువారం మండలంలోని ఇటుకులపహాడ్ గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గాన్ని ఎమ్మెల్యే ప్రత్యేక కృషితో అభివృద్ధి మార్గంలో నడిపిస్తున్నారని అన్నారు. అభివృద్ధిని కళ్లతో చూస్తున్న ప్రజలు మరోసారి ఎమ్మెల్యేగా గాదరి కిశోర్‌కుమార్‌ను గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. మాదిగ జేఏసీ ఎమ్మెల్యేకు పూర్తిగా మద్దతు ప్రకటిస్తుందని, ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ గెలుపునకు శక్తివంచనలేకుండా పనిచేస్తుందన్నారు. సమావేశంలో ఆయన వెంట దేవరకొండ దశరథ, నక్కల నరేశ్, గద్దపాటి వేణుగోపాల్, దేవరకొండ రాంబాబు, సహదేవ్, ఇంద్రకంటి జానయ్య, సైదులు, శ్రీను ఉన్నారు.

శంఖారావం సభను విజయవంతం చేయాలి


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

చండూరు(గట్టుప్పల్) : హైదరాబాద్‌లోని సరూర్‌నగర్‌లో సెప్టెంబర్ 3న నిర్వహించే పద్మశాలి శంఖారావం సభను విజయవంతం చేయాలని జెడ్పీటీసీ కర్నాటి వెంకటేశం, అఖిల భారత పద్మశాలి సంఘం రాజకీయ విభాగం అధ్యక్షుడు బొల్ల శివశంకర్, అఖిల భారత పద్మశాలి యువజన విభాగం జాతీయ ఇన్‌చార్జ్ అవ్వారి భాస్కర్ పిలుపునిచ్చారు. గురువారం గట్టుప్పల్ మండల కేంద్రంలో సభకు సంబంధించిన పోస్టర్లను వారు ఆవిష్కరించి మాట్లాడారు. తామెంతో.. తమకంతా అంటూ జరుగుతున్న సభను ప్రతి పద్మశాలి పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల సాధన సమితి కన్వీనర్ విడం కైలాసం, పద్మశాలి సంఘం గట్టుప్పల్ మండల ఉపాధ్యక్షులు తిరందాస్ రాములు, గంజి రాములు, సామల యాదయ్య కిషోర్, చేనేత కార్మిక సంఘం గౌరవ అధ్యక్షుడు చెరిపెల్లి కృష్ణయ్య, వెంకటేశం, జెల్ల పరమేశ్వరం, సాంబయ్య, జగన్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

చింతపల్లి: సంక్షేమ పథకాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీఓ శ్రీరాములు కోరారు. గురువారం చింతపల్లి మండల కేంద్రంలో లక్కీ డ్రా ద్వారా డబుల్ బెడ్రూం ఇళ్ల లబ్ధిదారులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలో 25 డబుల్ బెడ్రూం ఇళ్లను నిర్మించగా 53 మంది అర్హులుగా ఎంపిక చేశామని, ఎలాంటి అవకతవకలు లేకుండా లబ్ధిదారుల సమక్షంలో లక్కీ డ్రా తీసినట్లు పేర్కొన్నారు.

ఇళ్ల పంపిణీపై ఆందోళన

అర్హులకు డబుల్ బెడ్రూం ఇళ్లను కేటాయించాలని కోరుతూ ఎంపీడీఓ కార్యాలయం ఎదుట కాంగ్రెస్ పార్టీ నాయకులు ధర్నా నిర్వహించారు. ఇళ్ల పంపిణీ అధికార బీఆర్ఎస్ అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నట్లు ఆరోపించారు.

సమయ పాలన పాటించాల్సిందే..

- మున్సిపల్ కార్యాలయంలో బయోమెట్రిక్ ఏర్పాటు
- ఆలస్యమైతే జీతంలో కోత.. మెమోలు జారీ
- నిబంధనలు కఠినంగా అమలు చేస్తున్న అధికారులు


చండూరు మున్సిపల్ కార్యాలయంలో వేలిముద్ర (బయోమెట్రిక్) వేస్తున్న ఉద్యోగి


ఇరుకు గదిలో విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది

చండూరు : సమయపాలన పాటించకుండా ఇష్టానుసారంగా విధులకు వచ్చి వెళ్తామంటే ఇక నుంచి కుదరదు. ఇష్టారాజ్యంగా వచ్చి విధులు నిర్వహిస్తున్న మున్సిపల్ సిబ్బంది, కార్మికులను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం చండూరు మున్సిపల్ కార్యాలయంలో బయోమెట్రిక్‌ను ఏర్పాటు చేసింది. ఎప్పుడెళ్తే ఏంది..సంతకం పెడితే సరి అనే వైఖరితో కాలం వెళ్లదీస్తున్న కార్మికులకు, సిబ్బందికి ప్రభుత్వం బయోమెట్రిక్‌తో చెక్ పెట్టింది. కార్యాలయానికి ఆలస్యంగా వచ్చి మమ అనిపించుకొని ఇంటి బాట పట్టాలనుకునే సిబ్బందికి నిబంధనల మేరకు చర్యలు తీసుకునేందుకు మున్సిపల్ అధికారులు కార్యాచరణ చేపట్టారు. ప్రతి కార్మికుడి నుంచి మొదలు కొని కార్యాలయం సిబ్బంది వరకు బయోమెట్రిక్ వినియోగించుకోవాల్సిందే..సమయ పాలన పాటించాల్సిందే.సమయం దాటితే జీతంలో కోతతో పాటు మెమోలు సైతం జారీ చేస్తూ కఠిన నిబంధనలు అమలు చేస్తున్నారు చండూరు మున్సిపల్ అధికారులు.

కార్మికులకు.. సిబ్బందికి..

పారిశుద్ధ్య కార్మికులు ఉదయం 5.30 గంటలకు విధులకు వచ్చి కార్యాలయంలో బయోమెట్రిక్ వినియోగించాల్సిందే.. ఆ తర్వాత మధ్యాహ్నం 2గంటలకు మరో సారి బయోమెట్రిక్‌పై వేలిముద్రలు వేయాల్సి ఉంటుంది. ఇదే విధంగా కార్యాలయం సిబ్బంది ఉదయం 8.30నుంచి 9గంటల లోపు బయోమెట్రిక్‌ను వినియోగించుకోవాలి. నిమిషం ఆలస్యమైనా మెమోతో పాటు వేతనంలో కోత విధిస్తున్నారు. దీంతో ఉద్యోగులు, కార్మికులు సమయపాలన పాటిస్తూ వస్తున్నారు.

గదులు లేక ఇబ్బందులు..

మున్సిపల్ కార్యాలయంలో సిబ్బందికి సరిపడా గదులు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఆరుగురు సిబ్బంది మాత్రమే ఉండేది, ఇటీవల 12మంది వరకు ప్రమోషన్‌లో భాగంగా మున్సిపల్‌కు బదిలీపై వచ్చారు. ఉన్న ఒకే ఒక్క హాల్‌లో 20మంది వరకు సిబ్బందే ఇరుకు గదిలో కూర్చుంటున్నారు. పనుల నిమిత్తం వచ్చే ప్రజలకు నిలబడేందుకు సైతం స్థలం లేదు. ఇరుకు గదుల్లో ఇటూ సిబ్బంది.. అటూ ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మున్సిపల్ కార్యాలయానికి సిబ్బందికి సరిపడా నూతనంగా భవనాన్ని నిర్మించాలని పట్టణ వాసులు, సిబ్బంది కోరుతున్నారు.

ప్రతిఒక్కరూ సమయ పాలన పాటించాలి



కార్మికులు, సిబ్బంది ప్రతి నిత్యం సమయ పాలనపాటించాల్సిందే. కార్మికులు ప్రతి రోజు 5.30లోపు బయోమెట్రిక్‌ను వినియోగించుకోవాలి. సిబ్బంది మాత్రం ఉదయం 8.30 నుంచి 9గంటలలోపు బయోమెట్రిక్ వేయాల్సి ఉంది. ప్రతిఒక్కరూ సమయపాలన పాటించి.. ప్రజలకు అందుబాటులో ఉండాలి.

– ముజాయొద్దీన్, మున్సిపల్ కమిషనర్, చండూరు